

ఫుడ్ పాయిజన్‌పై కలెక్టర్ సీరియస్

నర్సాపూర్(జి) కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నెల రోజుల వ్యవధిలో రెండోసారి ఫుడ్ పాయిజన్ కావడంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్ అయ్యారు. 8లో▸

మూడో రోజు నామినేషన్లు నిల్

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మూడో రోజైన శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రిటర్నింగ్ అధికారి రాజర్షి షా నిర్ణీత సమయం వరకు తన చాంబర్‌లో నిరీక్షించినప్పటికీ నామినేషన్ వేసేందుకు ఎవరు రాలేదు. ఇప్పటి వరకు కేవలం మూడు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. ఆదివారం సెలవు. సోమవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశముంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.7 /27.5

ఆకాశం చాలావరకు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఒకటిరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గడువులోగా సీఎంఆర్ అప్పగించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



రైస్‌మిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కుంటాల: వర్షాకాలంలో సేకరించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువులోగా అప్పగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. అర్లి(కె)లోని ద్వారకామయి అగ్రో రైస్ మిల్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో రైస్‌మిల్‌కు 34,029 క్వింటాళ్ల ధాన్యాన్ని రైస్‌మిల్‌కు అందించారని తెలిపారు. ఈరైస్ మిల్ ద్వారా 2,320 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు 203 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అందించారన్నారు. గడువులోగా మిగతా బియ్యం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీఎస్‌వో నందిని, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరసింహారెడ్డి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఆర్ఐ అడెల్లు, మిల్ యజమాని తూర్పాటి వెంకటేశ్ ఉన్నారు.

విద్యుత్ సిబ్బందికి అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసరావు అధ్యక్షతన క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సీఈ కేఎస్.గుట్ట మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో భద్రతను విస్మరించొద్దన్నారు. అత్యంత జాగ్రత్త వహించా లని తెలిపారు విద్యుత్ సంస్థను నష్టాల నుంచి లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతులు, విద్యుత్ నియంత్రికల మరమ్మతు, విద్యుత్ పొదుపు, నష్టాలు నివారణ చర్యలు, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫర వంటి అంశాలపై అవగాహ న కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ చౌహన్, డీఈ నాగరాజు, ఏడీఈ రవి, రంగస్వామి క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు పీఈటీలు, పీడీలు, సీనియర్ ఆటగాళ్లు, జాతీయ క్రీడాకారులు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎంఏ.నఫీఖాన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు(10) వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ప్రముఖ క్రీడల ప్రతిపాదనలతో జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కుంటాల: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున కుంటాల మండలం కల్లూర్‌లో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆడబిడ్డకు సీటు ఇచ్చిందని ఆదరించాలని కోరారు. ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే జిల్లాకు నిధులు, ప్రాజెక్టులు తెస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కల్లూర్ సాయిబాబా ఆలయంలో మంత్రి సీతక్క, ఆత్రం సుగుణ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, రేఖాశ్యాం నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మాజీ జెడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌కు ఆమడ దూరం!

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఏటా రాష్ట్రం నుంచి యూపీఎస్సీ(యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటుతున్నారు. వివిధ వర్గాల నుంచి అభ్యర్థులు దేశ అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఆదివాసీ తెగలు మాత్రం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్, ఐఎఫ్ఎస్, ఇండియన్ పోలీస్ సర్వీస్(ఐపీఎస్)తోపాటు గ్రూప్ ఏ, బీ కేటగిరీ సర్వీసులకు ఇంకా ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. ఉమ్మడి ఏపీ నుంచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఈ స్థాయికి ఒక్కరూ చేరుకోకపోవడం ఆ వర్గాల వెనుకబాటుతనాన్ని తెలియజేస్తోంది. అదే సమయంలో ఎస్టీ ఇతర ఉపకులాల నుంచి అర్హత సాధిస్తున్నారు. కానీ గోండు, ప్రదాన్, నాయక్‌పోడ్, కోయ, అంధ్ తదితర తెగలతోపాటు పీవీటీజీ(పర్టిక్యూలర్లి వల్నెరెబుల్ ట్రైబల్ గ్రూప్స్) కొలాం, తోటి, కొండరెడ్డి తెగలకు ఈ హోదాలు అందని ద్రాక్షగానే మారాయి.

సండే స్పెషల్



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు చౌరస్తాలో తొలి ఆదివాసీ ఐఏఎస్ తుకారాం విగ్రహం

- 'సివిల్స్'కు ఆసక్తి చూపని ఆదివాసీలు
- ఉన్నత లక్ష్యం వైపు వెళ్లని అడవి బిడ్డలు
- రాష్ట్రం నుంచి ఏ ఒక్కరికీ దక్కని అవకాశం

రిజర్వేషన్ ఫలాలు ఉన్నా..

రాష్ట్ర జనాభాలో 9శాతంతో 31లక్షలకు పైగా గిరిజనులు ఉండగా, ఇందులో ఆదివాసీ తెగలు 10లక్షలకు పైగా ఉన్నారు. లంబాడా, ఇతర కులాలు 20లక్షలకుపైగా ఉంటారని అంచనా. ఆదిమ తెగలు మాత్రమే సివిల్స్‌కు దూరంగా ఉంటున్నారు. ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో 7.5శాతం కోటా, ఐదేళ్ల వయస్సు సడలింపుతో గరిష్ఠంగా 37ఏళ్లలో ఎన్ని సార్లయినా పరీక్ష రాసే(ఓబీసీలకు 9, జనరల్ 6సార్లు) అవకాశం ఉంది. కానీ ఆదివాసీ విద్యార్థులు అటు వైపు వెళ్లడం లేదు. 'సివిల్స్' ప్రయాణం అధిక ఖర్చు, సమయంతో కూడుకోవడంతో దూరంగా ఉంటారు. ఇటీవల అవగాహన పెరిగినప్పటికీ కింది స్థాయి ఉద్యోగాలకే పరిమితం అవుతున్నారు. ఆదివాసీ గూడేల్లో తల్లిదండ్రులకు మరింత అవగాహన కల్పించడంతోపాటు ఉన్నత లక్ష్యాలు ఎంచుకునేలా గిరిజన విద్యార్థులను ప్రోత్సహించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

అవకాశాలను అందిపుచ్చుకోలేక

ఆదివాసీలకు విద్య కోసం కేంద్ర, రాష్ట్రాలు రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఐటీడీఏ పర్యవేక్షణలో ప్రత్యేక స్కూళ్లు ఏర్పాటు చేసి, వసతితో విద్యను అందిస్తున్నాయి. ఇంగ్లిష్ మీడియంలోనూ విద్య అందుతోంది. డిగ్రీ తర్వాత బీఈడీ, బీటెక్, బీఫార్మసీ, మెడిసిన్ వరకు చదువుతున్నారు. కానీ సివిల్స్ లక్ష్యంగా వెళ్లడం లేదు. ఇక గిరిజన సంక్షేమ శాఖ నుంచి హైదరాబాద్‌లో గిరిజనులకు ఉచితంగా సివిల్ సర్వీసెస్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ఆదివాసీల అభ్యర్థులు పెద్దగా హాజరుకావడం లేదు. కిందిస్థాయి ఉద్యోగాలైన కానిస్టేబుల్, గ్రూప్–4, గ్రూప్–2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షల్లో నెగ్గుతున్నారు. విద్యావంతులు, ఉద్యోగస్తులు, ఆర్థికంగా ఉన్న కుటుంబాల పిల్లలు సైతం ఇటువైపు రావడం లేదు. ప్రస్తుతం కొంతమంది ఆసక్తి చూపిస్తుండడంతో, ఈ తెగల నుంచి భవిష్యత్తులో అఖిల భారత స్థాయి అధికారులుగా చూసే అవకాశం ఉంది.

ఒకే ఒక్క ఐఏఎస్ తుకారాం

ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి దాక ఆదిమ తెగల నుంచి మడావి తుకారాం ఒక్కరే ఐఏఎస్ హోదాకు చేరుకున్నారు. ప్రముఖ ఆంత్రోపాలజిస్టు హైమాన్ డార్ఫ్ స్ఫూర్తితో ఉన్నత విద్యనభ్యసించారు. మొదట అనువాదకుడిగా ఉద్యోగాన్ని ప్రారంభించి క్రమంగా గ్రూప్–1 సర్వీస్‌కు ఎంపికై, తర్వాత ఐఏఎస్ హోదా పొందారు. తుకారాం తర్వాత ఆ హోదాలో ఉన్న ఆదివాసీలెవరూ లేకపోవడం గమనార్హం. ఆయన కాలంలోనే ఆదివాసీలు చదువుకోవాలని అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఏటా నవంబర్ 29న వర్ధంతిని ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తుంటారు.

వెనకబడిపోతున్నారు..



ఆదివాసీల నుంచి ఇప్పటి వరకు నేరుగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉద్యోగాలకు ఎవరూ ఎంపిక కాలేదు. కొందరు ఆసక్తితో చదువుతున్నా ఫలితాల్లో వెనకబడిపోతున్నారు. భవిష్యత్తులో ఎంపిక అవుతారని ఆశిస్తున్నాం.

–సిడాం అర్జు పటేల్, సీనియర్ నాయకులు, గొండ్వానా, గోండ్ మహాసభ

ప్రభుత్వాలు ప్రోత్సహించాలి



ఆదివాసీలకు ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ఇందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

– కనకయాదవ రావు, మాజీ చైర్మన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ, ఆసిఫాబాద్

అమరులకు జోహార్లు

- ఇంద్రవెల్లి స్తూపం వద్ద నివాళులర్పించిన మంత్రి సీతక్క
- ఎంపీ సోయం, ఎమ్మెల్యేలు బొజ్జు, అనిల్ జాదవ్, శంకర్ సైతం..
- తరలివచ్చిన ఆదివాసీలు.. ప్రత్యేక పూజలు



స్మారక జెండా వద్ద సంప్రదాయ పూజలు చేసి నివాళులర్పిస్తున్న ఆదివాసీలు



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: తమ న్యాయమైన హక్కుల సాధన కోసం నాడు ఇంద్రవెల్లి వేదికగా పోరాడి అమరులైన వారికి జోహార్లంటూ ఆదివాసీలు శనివారం ఘన నివాళులర్పించారు. అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఇంద్రవెల్లి స్తూపం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు బొజ్జు, అనిల్‌జాదవ్, పాయల్ శంకర్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు, బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్, మాజీ ఎమ్మెల్యే రామన్న తదితరులు వేర్వేరుగా హాజరయ్యారు. కార్యక్రమానికి అధికారికంగా అనుమతి లేకపోయినా ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు, అమరుల కుటుంబసభ్యులు హాజరై సంప్రదాయ పూజలు చేశారు. ముందుగామండలకేంద్రంలోని గోండ్‌గూడ నుంచి సంప్రదాయ వాయిద్యాల మధ్య స్తూపం వద్దకు చేరుకున్నారు. దేవరి చహకటి నాగోరావ్ ఆధ్వర్యంలో పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. అమరులకు నివాళులర్పించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు.అనంతరం ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ లోగోను మంత్రి ఆవిష్కరించారు. ఎంపీ సోయం మాట్లాడుతూ, ఆదివాసీల న్యాయమైన హక్కుల సాధన కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్తూపం అభివృద్ధి చేయాలని కోరుతూ మంత్రికి ఎర్రజెండా ఆశయసాధన కమిటీ అధ్యక్షుడు నాగోరావు, సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న, జెడ్పీటీసీ పుష్పలత, బీజేపీ నాయకులురాజు,రాజలింగుతదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో బందోబస్తు

సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్సైలతో పాటు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అప్రమత్తమే ఆయుధం

- వేసవి నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- ఫైర్ అధికారి జయత్‌రామ్
- అగ్ని ప్రమాదాల నివారణకు సూచనలు



నిర్మల్ ఫైర్ ఆఫీసర్ జయత్ రామ్

నిర్మల్‌టౌన్: వేసవి వచ్చిందంటే చాలు నిప్పు రాజుకుంటుంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న భారీగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. విలువైన ఆస్తులు కాలిపోయే ప్రమాదం ఉంటుంది. ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా ఫైర్ ఆఫీసర్ జయత్‌రామ్ సూచనలు చేశారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు. అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు ప్రచారం చేస్తూ.. ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సలహాలు, సూచనలు ఆయన మాటల్లో..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. వేసవిలో చిన్న పిల్లలు ఇంటి పరిసరాల్లో నిప్పుతో ఆటలాడకుండా చూడాలి. ఒక్క నిప్పురవ్వ కూడా కూడా పెద్ద ప్రమాదానికి కారణమవుతోంది. ఇక ఇళ్లలో విద్యుత్ తీగలను గమనించాలి. నాసిరకం తీగలు వాడకుండా ఐఎస్ఐ గుర్తింపు ఉన్న వాటినే వినియోగించాలి. ఊరికి వెళితే ఇళ్లలోని మెయిన్ స్విచ్ ఆఫ్ చేసుకోవాలి. ఇంట్లో గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ చేయవద్దు. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ బండ ఉంచొద్దు.

- షాపింగ్ మాల్స్, ఆస్పత్రుల్లో ఆర్‌సీసీ, కాంక్రీట్ స్లాబులను మాత్రమే వాడాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఉంచుకోవాలి. ఫైర్ ఎక్విప్‌మెంట్లు మూడు నెలలకోసారి ప్రాక్టీస్ చేయాలి.
- కర్మాగారాల్లో చెత్తా చెదారం ఉంచకూడదు. ఉద్యోగులందరికీ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించాలి. మిషనరీ బెల్టులు, విద్యుత్ పరికరాల నుంచి నిప్పు రవ్వలు రాలకుండా జాగ్రత్త వహించాలి. విద్యుత్ లోడ్ హెచ్చు తగ్గులు లేకుండా చూడాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాములగా వేయాలి. గడ్డివాముల నుంచి ఇళ్లకు తప్పనిసరిగా 60 అడుగుల దూరం పాటించాలి. పెద్ద గడ్డివాములకు బదులు చిన్న గడ్డివాములు నిర్మించుకోవాలి. గుడిసెకు, గుడిసెకు మధ్య కనీసం 30 అడుగుల దూరం పాటించాలి.

పాటించవలసిన నిబంధనలు..

- ఆస్పత్రులు, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టూ ఫైర్ ఇంజిన్ తిరిగేందుకు వీలుగా నాలుగు మీటర్లు ఖాళీ స్థలం ఉండాలి.
- భవనాలు చుట్టూ పైపులైన్లతో కూడి హాజరీలు అమర్చాలి. ఆయా భవనాల ముందు భాగంలో డెక్ రేటివ్ గ్లాస్‌తో మూసివేయకుండా గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి.
- ఎత్తయిన భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు.
- భవనాలు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉంటే దాని చుట్టూ సేఫ్టీ పెన్సింగ్ ఏర్పాటు చేయాలి. 45 లీటర్ల ఫోమ్ ట్రాలీ, కంకరతో సోఫ్ పిట్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎమర్జెన్సీ లైట్లు, అధిక విద్యుత్ సరఫరా అయినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి.
- ఆస్పత్రులు, షాపింగ్ కాంప్లెక్సులు, హోటళ్లలో పనిచేసే సిబ్బందికి ఆరు నెలలకోసారి అగ్నిప్రమాదం జరిగితే ఏవిధంగా బయటపడాలి. వినియోగదారులు, రోగులను ఎలా రక్షించాలో శిక్షణ ఇవ్వాలి. రిహార్సల్స్ నిర్వహించాలి.

అందుబాటులో పరికరాలు..

జిల్లా ఫైర్ స్టేషన్లలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన అన్నిరకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం అందించింది. నిర్మల్ స్టేషన్‌లో ఒక రెస్క్యూ వాహనం, కట్టర్స్, రవలింగ్ బ్రాస్, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లు, కాటన్ తాడులు, నైలాన్ రోప్స్, మనీలా రోప్స్, పాలీ ప్రొపైలిన్ రోప్స్, వీటితోపాటు అన్ని రకాల పరికరాలు, 11 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే సంప్రదించాలి..

జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్ టోల్ ఫ్రీ నంబర్ 101, డయల్ 100కు ఫోన్ చేయాలి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలి. షాపింగ్ మాల్స్, ఆస్పత్రి, ఫ్యాక్టరీలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. నిర్మల్ ఎస్ఎఫ్‌వో ఫోన్ నంబర్ 8712699219, ఫైర్ స్టేషన్ నంబర్ 8712699218 లకు సంప్రదించవచ్చు.

పార్టీల్లో చేరికల పోటీ!



బీజేపీలో చేరిన శోభారాణి, సత్యనారాయణగౌడ్



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

- కాంగ్రెస్‌లోకి కేంద్ర మాజీ మంత్రి
- బీజేపీలోకి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతులు
- పోటాపోటీగా ఇరు పార్టీల్లో చేరికలు
- మొత్తంగా.. 'కారు'కే షాకులు

నిర్మల్: జిల్లాలో కాంగ్రెస్–బీజేపీల మధ్య చేరికల పోటీ నడుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఈపోటీ పెరుగుతోంది. ఈ రెండు పార్టీలూ కలిసి 'కారు'ను ఖాళీ చేసే పనిపెట్టుకున్నట్లే కనిపిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉన్న నేతలూ ఎప్పుడెప్పుడు ఎదుటి పార్టీల్లో చేరుదామా.. అన్నట్లు కనిపిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా నేతలు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. ఇక మిగిలినవారు బీజేపీలోకి వస్తున్నారు.

ఉన్నపళంగా మారిన 'చారి'..

ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా, కేంద్రమాజీ మంత్రిగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న వేణుగోపాలచారి ఉన్నపళంగా పార్టీ మారారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడిగా ఉంటూ వచ్చిన చారి బీఆర్ఎస్‌ను వీడటం చర్చనీయాంశమైంది. తన రాజకీయ జీవితం మొత్తం ఏ పార్టీనైతే ఎదురించారో.. ఇప్పుడు అదే పార్టీ కండువా వేసుకోవడం గమనార్హం. ఇప్పటికీ ఈ సీనియర్‌నేతకు ఉమ్మడి జిల్లాలో తనకంటూ ప్రత్యేక వర్గం ఉంది. వారెవ్వరికీ చెప్పకుండా ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. అలా.. ఆయన బీఆర్ఎస్‌కూ భారీ షాకిచ్చారు.

ఇంకా తేల్చని 'అల్లోల'

జిల్లా రాజకీయాల్లో మాజీ మంత్రి, సీనియర్ నేత అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఒంటరిగా మిగిలారు. ఏళ్లుగా ఆయన వెంట ఉన్న సీనియర్లంతా కాంగ్రెస్, బీజేపీలవైపు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఒకరిద్దరు సీనియర్లు మాత్రమే ఆయన వెంట ఉన్నారు. అల్లోల సైతం అటు బీఆర్ఎస్‌తో సంబంధాలు లేకుండా, ఇటు కాంగ్రెస్‌లో చేరకుండా.. ఇప్పటికీ డోలాయమాన స్థితినే కొనసాగిస్తున్నారు.

అందరిదీ 'అధికార'బాటనే..

జిల్లాలో రాజకీయం అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత.. అన్నట్లుగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆపార్టీ జిల్లాలోనూ క్రమంగా పట్టు పెంచుతూ వస్తోంది. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, మైనార్టీ నేత అర్జుమంద్ అలీలకు తోడుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రోత్సహిస్తుండటంతో చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఓటమితో కుంగిపోయిన బీఆర్ఎస్ నేతలూ 'అధికార'బాట పడుతున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించిన నేతలు పది నెలలు కూడా ప్రతిపక్షంలో ఉండలేకపోతున్నారని విమర్శిస్తూనే, కాంగ్రెస్‌కు పోటీగా బీజేపీ చేరికల స్పీడ్ పెంచుతోంది.

స్పీడ్ పెంచిన బీజేపీ..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీ సైతం జోరుపెంచుతోంది. ఇప్పటికే పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులను చేర్చుకుంది. తాజాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చివరి జెడ్పీ చైర్‌పర్సన్ శోభారాణి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ దంపతులు శనివారం బీజేపీలో చేరారు. నిర్మల్‌లోని సత్యనారాయణగౌడ్ నివాసానికి బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, సీనియర్ నేతలు వెళ్లి ఆయనను ఆహ్వానించారు. అనంతరం వారంతా కలిసి హైదరాబాద్ వెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో శోభాసత్యనారాయణగౌడ్ దంపతులు, పలువురు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ సీనియర్ నేతలు పార్టీలో చేరారు. త్వరలోనే మరికొందరు కౌన్సిలర్లు, సీనియర్ నేతలూ కమలదళంలో చేరనున్నట్లు నాయకులు ప్రకటించారు.

పీఆర్టీయూటీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శంకర్



శంకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ఉపాధ్యక్షుడిగా భామండ్ల శంకర్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, ఒడ్నాల రవి తెలిపారు. శంకర్ పెంబి మండలం కొత్తచెరువుగూడా పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శంకర్ పేర్కొన్నారు. పలువు ఉపాధ్యాయులు అతనిని అభినందించారు.

క్లుప్తంగా

ఒకరికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలం దహెగావ్‌కు చెందిన కొడప నేతాజీకి ఒక నెల జైలు శిక్ష విధిస్తూ పీసీఆర్ కోర్టు జడ్జి దుర్గారాణి శనివారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు.. దహెగావ్ గ్రామానికి చెందిన మట్టి సంజయ్‌పై పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని నేతాజీ అనే వ్యక్తి 2018 మే 29న రాయితో దాడి చేశాడు. దీంతో సంజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై బాధితుడు బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై సాయన్న కేసు నమోదు చేశాడు. ఏపీపీ నవీన్ ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా నేతాజీకి నెల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

కడెం: ఖానాపూర్ మండలం, కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గుడి తలుపు తాళాలు పగుల గొట్టి హుండీలో ఉన్న డబ్బులు ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాసరలో మహాదేవుని జెండా పండుగ



గోదావరి నది వద్ద పూజలుచేస్తున్న భక్తులు

భైంసా: డివిజన్ వ్యాప్తంగా శనివారం మహాదేవుని జెండా పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బాసర గోదావరి వద్ద మహా దేవుని జెండా కట్టెను ఉంచి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించారు.భైంసామండలం సిరాల, మహాగాం గ్రామంలో జెండా పండుగను జరుపుకున్నారు. సిరాల ఆలయానికి అంబళ్ల కుండల్లతో వెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. సా యంత్రం సమయంలో ప్రధాన వీధుల్లో జెండా కట్టెలను ఊరేగిస్తూ భక్తితో నృత్యాలు చేశారు.

టూరిజం కోర్సుల్లో ప్రవేశాలు

నిర్మల్‌చైన్‌గేట్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిదమ్) గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సుల్లో ప్రవేశాల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్మల్ జిల్లా పర్యాటక అధికారి(ఇన్‌చార్జి) ఎం.ఏ.నఫేఖాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత నిదమ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవలని సూచించారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్ మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలతోపాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జాతీయస్థాయి విద్యావిధానం ప్రకారం నిదమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తుందని పేర్కొన్నారు. అడ్మిషన్, ఇతర వివరాలకు జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో నేరుగా లేదా, 9849913071 నంబర్‌లో సంప్రదించవచ్చని వివరించారు.

ఫుడ్ పాయిజన్‌పై కలెక్టర్ సీరియస్

- నర్సాపూర్(జి) కేజీబీవీ పాఠశాల తనిఖీ
- అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- ఘటనపై నివేదిక ఇవ్వాని విద్యాశాఖ అధికారులకు ఆదేశం
- పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



కేజీబీవీ పాఠశాల వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి)కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నెల రోజుల వ్యవధిలో రెండోసారి ఫుడ్‌పాయిజన్ కావడంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్ అయ్యారు. శుక్రవారం సాయంత్రం పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసింది. దీంతో శనివారం పాఠశాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. వంటగది, డైనింగ్ హాల్, వాటర్ ట్యాంకును పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

పరిశుభ్రమైన భోజనం అందించాలి..

విద్యార్థులకు మెనూ ప్రకారం పరిశుభ్రమైన భోజనం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. తాజా ఘటనపై నివేదిక ఇవ్వాలని డీఈవో, ఎంఈవోను ఆదేశించారు. మరోసారి ఫుడ్‌పాయిజన్ జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట తయారీలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

ముగ్గురు సహాయ వంట మనుషుల తొలగింపు

కేజీబీవీ పాఠశాలలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన 22 మంది విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఘటనకు బాధ్యులైన ముగ్గురు సహాయ వంట మనుషులను తొలగించామని పేర్కొన్నారు. ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ అనంతుల వనితకు షోకాజ్ నోటీస్ జారీ చేశామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న జెండర్ కోఆర్డినేటర్‌ను మాతృ శాఖకు రీప్యాట్రియేట్ చేస్తూ రిలీవ్ చేశామని తెలిపారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి

- కలెక్టర్, డీఈవోను ఆదేశించిన మంత్రి సీతక్క

నిర్మల్: నర్సాపూర్(జీ) కేజీబీవీల్లో విద్యార్థినులు వరుసగా అస్వస్థతకు గురికావడంపై ఇన్‌చార్జి మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. శుక్రవారం మరోసారి ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయాన్ని శనివారం జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి దృష్టికి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వరుస ఘటనలపై లోతైన విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డికి సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల వేళ ప్రభుత్వంపై మచ్చ తెచ్చేలా ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారా.. అనే కోణంలోనూ విచారణ చేయాలని తెలిపారు. వరుస ఘటనలపై డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సైతం జిల్లా అధికారులను కోరారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



గంగయ్య (ఫైల్)

సోన్: ఉన్న ఊరిలో ఉపాధి కరవై.. కుల వృత్తి కూడు పెట్టడం లేదని గల్ఫ్ బాట పట్టిన సోన్ మండలం గంజాల్ గ్రామానికి చెందిన పోలెపు గంగయ్య(43) చివరకు శవపేటికలో తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగయ్యకు గ్రామంలో ఎలాంటి భూమి లేదు. కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. పిల్లలు పెరుగుతుండడంతో మెరుగైన జీవితం కోసం 13 ఏళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. పదేళ్లు సౌదీలో లేబర్ పనిచేశాడు. మూడేళ్ల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. కూతురు పెళ్లి చేశాడు. ఇందుకోసం అప్పులు చేశాడు. అవి తీర్చేందుకు మళ్లీ దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూడా లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న పనికి వెళ్లొచ్చి గదిలో పడుకున్నాడు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో సహచరులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారం రోజుల తర్వాత మృతదేహం స్వగ్రామానికి శనివారం చేరుకుంది. నిర్జీవంగా వచ్చిన గంగయ్యను చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. గంగయ్యకు భార్య లక్ష్మి, కుమారుడు వంశీ, కూతురు అనూష ఉన్నారు.

జాతీయ క్రికెట్ అకాడమీకి హిమతేజ

- గుజరాత్‌లో నిర్వహించనున్న 'అండర్–23' శిబిరానికి ఎంపిక



జాతీయ క్రికెట్ అకాడమీకి ఎంపికైన హిమతేజ

కైలాస్‌నగర్: జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)ఆధ్వర్యంలో మే 21 నుంచి జూన్ 9వ తేదీ వరకు గుజరాత్‌లోని సూరత్‌లో నిర్వహించనున్న ఎమర్జింగ్ అండర్–23 హైపర్మార్మెన్స్ క్యాంపునకు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన హిమతేజ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఎన్‌సీఏ క్రికెట్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హెచ్‌సీఏ కెప్టెన్‌గా కొనసాగుతున్న హిమతేజను ఆలిండియా జూనియర్ సెలెక్షన్ కమిటీ జాతీయస్థాయి శిక్షణ శిబిరానికి ఎంపిక చేసినట్లుగా అందులో పేర్కొన్నారు. మే 20న సూరత్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. క్రికెట్‌లో మరింతగా రాణించేలా ఈ శిబిరంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

బైక్ చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

భైంసాటౌన్: బైక్ చోరీ కేసులో ముగ్గురిని రిమాండ్‌కు పంపినట్లు భైంసా పట్టణ సీఐ డి.రాజారెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలోని కోర్బాగల్లీకి చెందిన సమీముల్లా ఈనెల 16న తన ఇంట్లో బైక్‌ను నిలిపి ఉంచి హైదరాబాద్ వెళ్లాడు. మరుసటి రోజు సాయంత్రం ఇంటికి వచ్చాడు. బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజీ పరిశీంచగా, షేక్ నదీం, అన్సార్ ఖురేషితోపాటు మరో మైనర్ బాలుడు బైక్ తీసుకెళ్లినట్లు గుర్తించారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి నిందితులకు రిమాండ్ విధించారు.

రాహుల్‌గాంధీది త్యాగాల కుటుంబం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబామనే విషయాన్ని బీజేపీ గుర్తుంచుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. మావల మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మాత్రం మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తూ జీఎస్టీ పేరుతో పేదలను దోచి ధనవంతులకు పెడుతోందని విమర్శించారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 22న జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రేఖా శ్యాంనాయక్, రాథోడ్ బాపూరావ్, తలమడుగు జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస రెడ్డి, ఆడే గజేందర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావ్, నాయకులు ఆనంద్‌రావ్, శ్రీధర్, రూపేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విజయయాత్రకు అనుమతి ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నిర్మల్‌లో ఈనెల 21న 100 బైక్‌లతో వీర హనుమాన్ విజయ యాత్రకు అనుమతి ఇవ్వాలని జిల్లా పోలీసు అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు యాత్ర నిర్వహించుకోవాలని, డీజే సౌండ్ వినియోగించకూడదని, రాజకీయ, ఇతర వర్గాలను రెచ్చగొట్టేలా ఎలాంటి వ్యాఖ్యలు, నినాదాలు చేయరాదని పిటిషనర్లను ఆదేశించింది. ఈ షరతులను ఉల్లంఘిస్తే యాత్ర రద్దుపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను పోలీసులకు ఇచ్చింది. నిర్మల్ పట్టణంలో వీర హనుమాన్ విజయ యాత్రకు అనుమతి ఇచ్చేందుకు పోలీసులు నిరాకరించారని.. అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ బీ.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియురాలి మృతి
- ప్రాణాపాయ స్థితిలో యువకుడు
- ప్రియుడికి ఇప్పటికే వివాహం
- ఇరుకుటుంబాల్లో విషాదం
- ఆదిలాబాద్ జిల్లా పిప్పల్‌ధరిలో ఘటన



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న భుజంగ్‌రావు

ఆదిలాబాద్‌రూరల్: ప్రేమజంట ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో శనివారం కలకలం రేపింది. కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్న ఆ జంట పెళ్లి వరకు వెళ్లలేక పోయింది. కుటుంబీకులు ఒప్పుకుంటారో లేదోనని, విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందేమోననే ఉద్దేశంతో వారు ఎవరికీ చెప్పుకోలేక పోయారు. ప్రియుడు మాత్రం కొన్నేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ప్రియురాలు అలాగే ఉండిపోయింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన యువకుడు తాస్కాండే భుజంగ్‌రావు, అదే గ్రామానికి చెందిన ఓ బాలికతో కొంతకాలంగా ప్రేమాయణం సాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్న సమయంలో భుజంగ్‌రావు పంట చేనులోకి ఇద్దరు కలిసి వెళ్లారు. కొంత సేపు అక్కడే కూర్చొని మాట్లాడుకున్నారు. ఆమెకు తాళికట్టి, కాలికి మట్టెలు పెట్టినట్లు సమాచారం. ఎలాగో పెళ్లి చేసుకున్నప్పటికీ కలిసి జీవించలేమని బాధకు గురైన ఈ జంట వారి వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగారు. పొలంలో విగత జీవులుగా పడి పోయారు. చేను వైపు వెళ్లిన భుజంగ్‌రావు సోదరుడు వారిని గమనించి వెంటనే స్థానికులకు సమాచారం అందించాడు. వారి సాయంతో హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భుజంగ్‌రావు ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రిమ్స్ కు చేరుకున్నారు. కాగా ప్రియుడికి ఇది వరకే పెళ్లై భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. ఇరు కుటుంబీకులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. రూరల్ ఎస్సై ముజాహిద్ రిమ్స్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. అయితే ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై ఎస్సైను సంప్రదించగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రూ.1.15 లక్షలు పట్టివేత



పట్టుబడ్డ నగదుతో ఎస్సై, సిబ్బంది

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాల తనిఖీల్లో రూ.1.15 లక్షలు పట్టుకున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. కౌట్ల(బి) గ్రామానికి చెందిన పెందన లక్ష్మణ్ నగదు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈమొత్తాని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో డిపాజిట్ చేశామని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో సీఐ రాజారెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని కమల థియేటర్ రోడ్డు, వివేకానంద చౌరస్తా సమీపంలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఎండీ షేక్ అహ్మద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

'అగ్నిమాపకం'పై అవగాహన


నిర్మల్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జైత్‌రాం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం 108, 102 అత్యవసర వాహనాల మేనేజర్లు, సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరును వివరించారు. ఇందులో డీవోపీ రవి, హుస్సేన్‌షా, ఎల్ఎఫ్ ఎ.శ్రీనివాస్, ఎస్ఎంలు నవీన్‌కుమార్, అజయ్‌కుమార్, బి.నాగేశ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



పొక్లెయిన్‌తో ఆయిల్‌పాం చెట్ల తొలగింపు ఇలా..

'ఆయిల్' ఆశలు ఆవిరి

- నీరు కరువై.. సాగు భారమై
- 250 ఆయిల్‌పాం మొక్కలను తొలగించిన రైతు
- రెండేళ్ల కష్టం వృథా



తొలగించిన చెట్లను చూపుతున్న రైతు

తాంసి: మండుతున్న ఎండలు.. అడుగంటిన భూగర్భజలాలతో సాగునీరందక రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడులు అందక పంటపై నమ్మకం పోయిన రైతు రెండేళ్లుగా పెంచిన ఆయిల్‌పాం చెట్లను ఏకంగా పొక్లెయిన్‌తో తొలగించిన ఘటన ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాడి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నవనీత్ తనకున్న ఐదెకరాల్లో రెండేళ్ల క్రితం 250 ఆయిల్ పాం మొక్కలు నాటాడు. చేను సమీపంలో ఉన్న మత్తడివాగులో విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసుకొని పంటకు నీరందిస్తున్నాడు. ప్రస్తుతం మొక్కలు పూత, కాత దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ప్రాజెక్టు పూర్తిగా అడుగంటింది. మొక్కలకు నీరందని పరిస్థితి. చేనులో రెండు బోర్లు వేసినా నీరు పడకపోవడంతో చెట్లన్నీ ఎండిపోయే దశకు చేరుకున్నాయి. గత్యంతరం లేక చెట్లను పొక్లెయిన్ సాయంతో శనివారం తొలగించాడు. పంట సాగు కోసం ఇప్పటివరకు రూ.3లక్షల వరకు ఖర్చు అయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సోషల్ మీడియాలో యువతిని వేధించిన వ్యక్తి అరెస్ట్



మామడ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

మామడ: సోషల్ మీడియాలో ఓ యువతి ఫొటోలు పెట్టి వేధిస్తున్న వ్యక్తిని మామడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కడ్తాల సాగర్ ఓ యువతిని ప్రేమించాలనే ఉద్దేశంతో ఫేక్ ఇన్‌స్టాగాం ఐడీ క్రియేట్ చేశాడు. ఇదే క్రమంలో ఒక అమ్మాయి తన చెల్లెలితో దిగిన ఫోటోను తన ఇన్‌స్టాగాంలో పోస్ట్ చేసింది. యువతి పోస్ట్ చేసిన ఫొటోను సాగర్ తాను క్రియేట్ చేసిన ఫేక్ ఐడీకి డీపీగా పెట్టుకుని యువతికి మేసేజ్ చేశాడు. తమ ఫొటోను డీపీగా ఎందుకు పెట్టావ యువతి ప్రశ్నించగా, ఇక నుంచి అశ్లీల ఫొటోలు పెడతానని బెదిరించాడు. దీంతో సదరు యువతి ఇన్‌స్టాగామ్ ఖాతాను మూసివేసింది. అయినా సాగర్ సదరు యువతి పరువు తీయాలనే ఉద్దేశంతో యువతి పేరుతో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి ఆమె ఫొటోను డీపీగా పెట్టాడు. ఆ అకౌంట్‌లోకి అశ్లీల ఫొటోలను అప్‌లోడ్ చేసి మేసెజ్‌లు పంపించి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సందీప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కేసును ఛేదిచారు. సాగర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

అమ్మవారిని దర్శించుకున్న భద్రాద్రి ఎస్పీ



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ బి.రోహిత్‌రాజ్ శనివారం దర్శించుకున్నారు. బాసర చేరుకున్న ఎస్పీ తన కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. తన కుమారుడికి అక్షరాభ్యాస పూజలు చేయించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీస్సులు అందజేసి తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

భక్తుల దర్శనంతో ఆలయాలకు వైభవం

- శ్రీత్రిదండి చినజీయర్‌స్వామి



పొన్కల్ ఆలయంలో భక్తులకు ప్రవచనాలు అందిస్తున్న చినజీయర్‌స్వామి

మామడ: భక్తుల దర్శనంతోనే ఆలయాలకు వైభవం వస్తుందని, ప్రతి ఒకరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని శ్రీత్రిదండి రామనుజ చినజీయర్‌స్వామి అన్నారు. మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయాన్ని శనివారం సందర్శించారు. ఆలయాలకు భక్తులు భక్తి శ్రద్ధలతో చేసే సేవలతోనే వైభవం వస్తుందన్నారు. పొన్కల్ వేంకటేశ్వరాలయంను రాతితో నిర్మాణం చేయడంతోపాటు భక్తులు ఎక్కువ సంఖ్యలో సందర్శించడం, భజన, కీర్తనలతో వేంకటేశ్వరస్వామిని కీర్తించడంతో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. పెరుమాండ్లు పుట్టిన రోజు వేడుకలను బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం ఆదర్శనీయమన్నారు. ఆలయం ప్రతిష్టాపన కార్యక్రమానికి 2006లో వచ్చానని, ఆలయం ఇప్పుడు బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. గ్రామంలో భక్తిభావం పెరగడంతో ఆలయం సుప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమంలో భక్తులు ప్రభాకర్‌రావు, హరీశ్‌కుమార్, వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి


కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

దస్తురాబాద్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని పెర్కపల్లె కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువల్ల తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సర్ఫరాజ్ నవాబ్, ఆర్‌ఐ గంగన్న, ఐకేపీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం హైదరాబాద్‌లోని ఒమేగా, హోలిస్టిక్ ఆస్పత్రులకు చెందిన ప్రముఖ వైద్యులచే మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. గైనకాలజీ, ఆంకాలోజీ, కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ వైద్యులు ఉచితంగా సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సీతక్క రాక

ముధోల్/తానూర్: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నేడు ముధోల్, తానూర్ మండలాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, పుండలిక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలతో సమావేశం, పార్టీ గెలుపుపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పదాధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు మాంసం విక్రయించవద్దు

నిర్మల్‌చైన్‌గేట్: అనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారం జైనమత ప్రచారకుడు మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో ఎలాంటి మాంసం విక్రయించవద్దని మున్సిపల్ కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. చేపలు, చికెన్, మటన్ ఎవరైనా అమ్మినచో మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి కఠినంగా అమలుచేయాలి

భైంసాటౌన్: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల పరిశీలకులు డాక్టర్ వివేకానంద జాధవర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మాట్లాడారు. ఆయా పార్టీల అభ్యర్థుల కదలికలు, ప్రచార వ్యయం, తదితర అంశాలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. అంతకుముందు మండలంలోని మాటేగాం టోల్ ప్లాజా, తానూర్ మండలంలోని బెల్‌తరోడ వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను పరిశీలించారు.

ఆర్థికసాయం అందజేత

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన ఇస్లావత్ సుధాకర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. 2009 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు రూ.20 వేలు పోగు చేసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్, ప్రశాంత్, అంజన్న, మనోజ్, నాగరాజు, రాజేందర్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు

- మానసిక నిపుణుడు డాక్టర్ అల్లాడి సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి డాక్టర్ అల్లాడి సురేశ్ తెలిపారు. పరీక్షల సమయం ముగిసిందని, ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఫెయిల్ అయ్యామని మానసిక ఒత్తిడితో ఆత్మహత్య ఆలోచనలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆత్మహత్యలను నివారించడానికి విద్యార్థుల్లో ఏర్పడిన మానసిక ఒత్తిడిని, ఆందోళన, ఆత్మన్యూనత భావాన్ని తొలగించాలని సూచించారు. సలహాలు, సూచనలు ఇవ్వడానికి భారత ప్రభుత్వం 14416 అనే టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అన్ని భాషలలో సహాయం లభిస్తుందని తెలిపారు. ఎలాంటి మానసిక ఇబ్బందులకు గురైన, ఎలాంటి ఆత్మహత్య ఆలోచనలు వచ్చినా 14416నంబర్‌కు కాల్‌చేసి తగిన సహాయం పొందవచ్చని పేర్కొన్నారు.


కల్లూర్‌లో నేలవాలిన జొన్న


కల్లూర్ లో ఈదురు గాలులకు లేచిపోయిన రేకుల షెడ్డు పైకప్పు


కల్లూర్‌లో గాలికి లేచిపోయిన పెద్దమ్మి ఇంటి రేకులు

అకాల వర్షం.. అపార నష్టం

- నేలకొరిగిన జొన్న, నువ్వుపంటలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లూర్, ఓలా, అందాకూర్, పెంచికల్‌పాడ్, అంబకంటి, లింబా(కె), తదితర గ్రామాల్లో జొన్న, నువ్వు పంటలు నేలవాలాయి. కల్లాల ఎదుట విక్రయించేందుకు ఉంచిన మొక్కజొన్న పంట తడిసి ముద్దయింది. కల్లూర్‌లో భారీ ఈదులు గాలులకు పెద్దమ్మి అనే మహిళకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అందాకూర్ చెరువు సమీపాన పిడుగుపాటుకు విద్యుత్ ఇన్సులేటర్లు పగిలిపోయాయి. అందకూర్ శివారు ప్రాంతంలో భారీ ఈదురుగాలులకు గద్దెపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కిందకి పడిపోయింది. దీంతో ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించారు. అకాల వర్షంతో వాతావరణం చల్లబడినా శనివారం ఉక్కపోతతో ప్రజలు సతమతమయ్యారు.

సారంగాపూర్‌లో..

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. స్వల్ప ఈదురుగాలులు, ఉరుమురులు, మెరుపులతో వర్షం కురువడంతో మొక్కజొన్న రైతులు పంటలపై టార్పాలిన్‌లు కప్పివేశారు.


అందాకూర్ శివారులో ఈదురు గాలులకు పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

వైద్యవృత్తిని సామాజిక బాధ్యతగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యవృత్తిని వ్యాపారంలా కాకుండా సామాజిక బాధ్యతగా నిర్వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం ఐఎంఏ నిర్మల్ శాఖ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ రవీందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మురళీధర్‌తో పాటు వైద్యులంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ సీనియర్ వైద్యులు డాక్టర్ అప్పాల చక్రధారి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రమోద్‌చంద్ర రెడ్డి, కోశాధికారి డాక్టర్ ముఖేష్, సమాచార ప్రతినిధి డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, మహిళా ప్రతినిధి డాక్టర్ సరోజ రామణగౌడ్, ఉపాధ్యక్షులు డాక్టర్ రాకేష్, చింతపండు రవి, సంయుక్త ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, సుచిన్, వైద్యులు రామకృష్ణ, దామెర రాములు, సంతోష్, స్వర్ణ, రజని, సురేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఆర్టీసీ డ్రైవర్లకు కూల్‌క్యాన్ల పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: ఎండనుంచి ఉపశమనం పొందేందుకు ఆదిలాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఎమ్) ప్రవీణ్ కుమార్ ఆర్టీసీ నిర్మల్ డిపోలో డ్రైవర్లకు ఐదు లీటర్ల క్యాన్లను అందచేశారు. డ్రైవర్లు డ్యూటీకి వెళ్లేటప్పుడు డిపోలో గల ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ నుండి ఈకూల్ క్యాన్ నింపుకుని వెళ్లాలని సూచించారు. తలకు, చెవులకు వడదెబ్బ తగలకుండా తెల్లని రుమాల్ చుట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఎమ్) నవీన్ కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


క్యాన్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఆర్ఎం

ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర

ఖానాపూర్: బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం వీరహనుమాన్ విజయయాత్ర ఘనంగా నిర్వహించారు. ఎన్నికలకోడ్ నేపథ్యంలో పోలీసుల అనుమతి లభించకపోవడంతో కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ధ్వజారోహణ అనంతరం జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పట్టణంలోని ప్రధానవీధుల గుండా యాత్ర కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాశవేని ప్రణయ్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేష్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు అల్లాడి వెంకటేశ్వర్లు, పెరిక గంగాధర్, ఆకుల శ్రీనివాస్, ఆసం ఉదయ్, అంకం మహేందర్, తోకల బుచ్చన్న, నాయిని సంతోశ్, దయానంద్, రమేశ్, శ్యామ్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆనంద్, రవీందర్‌రెడ్డి, శివ, భూమేశ్ పాల్గొన్నారు.


యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి అమ్మ ఆదర్శ కమిటీలు కృషి చేయాలని పీఆర్ ఈఈ శంకరయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని చామన్‌పెల్లి, మునిపెల్లి, మాచాపూర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు వచ్చిన పనులు, నిధుల వివరాలను కమిటీలకు, హెచ్‌ఎంలకు వివరించారు. అనంతరం ఆయా పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ కమిటీలు, వీవోలతో కలిసి పాఠశాలలకు మంజూరైన పనులు చేపట్టి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీలు తగిన సహకారం అందించాలన్నారు. డిప్యూటీ ఈఈ రాజేందర్, ఏఈ శ్రీధర్, ఏపీఎం వాణిశ్రీ పాల్గొన్నారు.

‘అమ్మ ఆదర్శ పాఠశాల’ ఇక్కట్లు తొలగించాలి

నిర్మల్ రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల నిర్వహణలో ఉపాధ్యాయుల ఇక్కట్లు తొలగించాలని కోరుతూ పీఆర్టీయూ తెలంగాణ ప్రతినిధులు డీఈవోకు శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బడుల్లో పూర్తిచేసిన అభివృద్ధి పనుల నిధులు ఇంకా చెల్లించలేదన్నారు. పనులు మంజూరైనా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలో ఉండి తీరాలని ఆదేశించడం సరికాదన్నారు. ఆదివారం సైతం పాఠశాలకు హాజరై పనులు పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులకు సూచిస్తున్నారన్నారు. చెక్కుల ద్వారానే చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. పనుల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించకుండా ప్రారంభించాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ప్రధాన కార్యదర్శి రవిరాజు, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు సురేశ్, అడప శ్రీకాంత్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

తానూరు: బోరిగాం, హిప్నెల్లి, జౌలా(బి), ఎల్వి, భోసి గ్రామాల్లోని మహాదేవుని ఆలయంలో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాదేవుని జెండాను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. జెండా కట్టెకు పూజలు నిర్వహించారు.

మరుగుదొడ్ల మరమ్మతు చేయిస్తాం

లోకేశ్వరం : అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పాఠశాలల్లోని మరుగుదొడ్లకు మరమ్మతు చేయిస్తామని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పాఠశాలతో పాటు బామ్నికే, రాజూర ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట పీఆర్‌ఏఈ రఘువంశీ, ప్రధానోపాధ్యాయుడు జయసుందర్, ఐకేపీ సభ్యులు ఉన్నారు.

నేడు వీర హనుమాన్ శోభాయాత్ర

నిర్మల్‌చైన్‌గేట్: భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఆదివారం శ్రీ వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు భజరంగ్ దళ్ అధ్యక్షుడు మాహురం కపిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీ దేవరకోట దేవస్థానం నుండి ఆదివాసీల గుస్సాడీ నృత్య ప్రదర్శనలతో పురవీధుల గుండా కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ సహ కార్యవాహ ఓరుగంటి శ్రీనివాస్, ముఖ్యఅతిథులుగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ముప్పిడి రవి, శ్రీనివాస్, నరేందర్ ప్రభు, అనిల్, రమేశ్, నరేష్ సాయి, గోవింద్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్..

నిర్మల్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఆదివారం పట్టణంలోని మద్యం, కల్లు దుకాణాలు మూసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన హనుమాన్ స్వాములు శనివారం కొండగట్టుకు పాదయాత్రగా బయలు దేరారు. 135 మంది స్వాములు, నాన్ స్వాములు ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాదయాత్రగా బయలుదేరారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఎనగందుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.5వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తోట సుమిత్, కొక్కుల ప్రదీప్, చింతపండు రవి, వెంకట్‌మహేంద్ర, రాజశేఖర్, నాగేందర్‌రావు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచార రథాలు ప్రారంభం


ప్రచార రథాలు ప్రారంభిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార రథాలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్ శనివారం ప్రారంభించారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జెండా ఊపి రథాలను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, దివాకర్, రాజు, రాకేష్, మణికంఠ, ప్రశాంత్‌రెడ్డి, సుమిత్, ప్రణీత్, మహేందర్, అజయ్, రామ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి


విద్యార్థులను పరామర్శిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను నిర్మల్ జిల్లా ఆసుపత్రిలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు శనివారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంట నర్సాపూర్ (జి) పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు ఉమా మహేశ్వర్, అజీమ్, నయన్నగారి మురళి, మనోజ్ యాదవ్, గాజుల రవి కుమార్, తదితరులు ఉన్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కిన కలెక్టర్

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటి ట్యాంకును కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం పైకిఎక్కి పరిశీలించారు. నీటి సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టనున్న పనులను రెండు వారాల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, మరుగుదొడ్లు, నీటిసరఫరా, స్లాబ్ లీకేజీ వంటి పనులు చేపట్టాలని సూచించారు. పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీఎస్‌వో నందిత, మిషన్ భగీరథ డీఈ సందీప్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ కస్తూరి శంకర్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఆర్‌ఐ వేణుగోపాల్, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


నీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సంఘ బ్యానర్లపై విరమణ కార్యక్రమాలు సరికాదు

నిర్మల్ రూరల్: ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సన్మానం చేసే కార్యక్రమంలో సంఘ బ్యానర్లు పెట్టడం సరికాదని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19న భైంసా మండలంలోని మాటేగాం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం వేదిక బ్యానర్‌పై పీఆర్టీయూ సంఘం పేరు ప్రదర్శించడంతో ఆ పాఠశాలలో పనిచేస్తున్న వివిధ సంఘాల ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితికి కారణమైన సంఘ నాయకుల పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన యాదవ్, లక్ష్మణ్, టీయూటీఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రవికాంత్, వహీద్ ఖాన్, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శంకర్ ,అశోక్ ,ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భిక్షపతి నాయక్, క్రాంతికుమార్, గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

సోన్: మండలంలోని కడ్తాల్‌లో శనివారం పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా డైట్ కాలేజీలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.


ప్రచారంలో పాల్గొన్న కృష్ణవేణి

మాజీ మంత్రి గడ్డెన్న సేవలు మరువలేనివి

భైంసాటౌన్: మాజీ మంత్రి, దివంగత గడ్డిగారి గడ్డెన్న ముధోల్ నియోజకవర్గానికి చేసిన సేవలు మరువలేనివని సీనియర్ నాయకులు మురళీగౌడ్ అన్నారు. పట్టణంలోని గడ్డెన్న నిలయంలో ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం గడ్డెన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింధే ఆనంద్‌రావుపటేల్, దామోదర్‌రెడ్డి, ఫారూక్ అహ్మద్, ఆసిఫ్, ప్రసంజిత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాంలో గడ్డెన్న చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజానంద్, ప్రవీణ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి